# మానవత్వం

విశ్వనాథం సీటుకి చేరగిలబడి భారంగా కళ్లు మూసుకున్నాడు. ప్రక్కన భార్య కిటికీ నుండి బయటకు చూస్తోంది నిర్వేదంగా. వ్యాను ముందుకు కదిలింది. ఆయన ఆలోచనలు వెనక్కి మళ్లాయి.

***

రామనాథం వ్యవసాయదారుడు. అతనికి విశ్వనాథం ఒక్కడే కొడుకు. గారాబం కొంత, పట్నంలో చదువు పేరిట వ్యసనాలు అబ్బి మరికొంత... చదువు మీద అశ్రద్ధ మొదలయ్యింది.

సైన్స్ గ్రూపులో చేరాలని ఉండేది. వచ్చిన అత్తెసరు మార్కులకి ఆర్ట్స్‌లో సీటు వచ్చింది. మూడోసారికి ఎలాగో ఇంటర్ పూర్తి చేశాడు విశ్వనాథం. సరుకు లేదు. బి.కాంని కామ్‌గా వెళ్లదీశాడు.

ఫ్రెండ్స్ డాక్టర్స్, ఆఫీసర్స్, ఇంజనీర్స్ అయ్యారు. తనేమో క్లర్క్‌గా సెటిలయ్యాడు. పెళ్ళయ్యింది. ఇద్దరు మగపిల్లలు పెద్దవాళ్ళయిపోయారు. తను

ఇంటికి పెద్దయ్యాడు.

చదువుపట్ల విశ్వనాథానికి ఏదో తీరని వ్యామోహం. తన తోటివాళ్లు పైకెదిగారు. తనిలా గుమస్తాగా మిగిలిపోయానన్న కసి. చివరికది తన సంతానం పైకి మళ్లింది.

ఎలాగైనా పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని, వాళ్ల ద్వారానైనా హై పొజిషన్‌కి చేరాలనే ఆకాంక్ష మొదలయ్యింది. పిల్లల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ చూపెట్టాడు. వాళ్లకి చదువే లోకమయ్యేటట్లు చేశాడు.

ప్రైమరీ స్టడీస్ వరకు పిల్లలకి స్కూలు, ట్యూషన్, ఇల్లు తప్ప మరో ధ్యాస లేకుండా జాగ్రత్త పడ్డాడు. ఆరవ క్లాసులోకి రాగానే ఇద్దర్నీ హాస్టల్‌లో వేశాడు.

ఇద్దరు పిల్లలు అలా అలా విశ్వనాథం ఆలోచనలకి అనుగుణంగానే చదివారు. ఎదిగారు. ఒకర్ని డాక్టర్‌గా, మరొకర్ని ఐ.ఎయస్. ఆఫీసర్‌గా చూడాలని కలలు కన్నాడు.

అలాగే పెద్దవాడు డాక్టర్ అయ్యాడు. చిన్నవాడు ఇంజనీరింగ్‌లో పీజీ పూర్తి చేయగలిగాడు మంచి పర్సెంటేజ్‌తో... కానీ గ్రూప్స్ వైపు మొగ్గు చూపలేదు.

పెద్దబ్బాయి క్లినిక్ ఓపెన్ చేశాడు. తండ్రి చూపిన అమ్మాయినే పెళ్లి చేసుకున్నాడు. చిన్నబ్బాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికా వెళ్లిపోయాడు. అక్కడి ఇంగ్లీష్ అమ్మాయితో సెటిలయ్యాడు.

ఫోన్లో విషయం తెలిసి విశ్వనాథం మౌనం వహించాడు. భార్య కన్నీళ్లు పెట్టుకుంది.

కొన్నాళ్లకి భార్య ఫోర్స్‌తో డాక్టరబ్బాయి స్టేట్స్‌కి షిఫ్టయ్యాడు.

విశ్వనాథం దంపతులు ఒంటరి వాళ్లయ్యారు. తనేమో రిటైరయ్యాడు. లంకంత కొంప, తనకొచ్చిన పెన్షన్ డబ్బులు, పిల్లలిద్దరూ పంపే డబ్బు. అంతా డబ్బే! కానీ బిక్కు బిక్కుమంటూ ఒంటరిగా... ఇద్దరు! పైగా ఏ కొడుకూ తల్లిదండ్రుల్ని తమ దగ్గరకు రప్పించుకోవడానికి సిద్ధంగా లేరు!!

అదిగో అప్పుడు మొదలయ్యింది విశ్వనాథంలో ఆందోళన.

వార్ధక్యం కోరుకునేది ఏది? డబ్బా!... డాలర్స్‌కి డాలర్స్ పుట్టించే ప్రజ్ఞ ఇద్దరు పిల్లల్లోనూ ఎవరెస్టంత ఎదిగింది.

కానీ ఓ జీవితపు ఆఖరి ఘట్టంలో మనిషికి కావల్సింది? ప్రశ్నల పరంపర మొదలయ్యిందతని మనసులో. తను గెలిచాడా... ఓడాడా... పజిలయ్యాడు.

"ఏమండీ!"

వాళ్లని చదువుకి కట్టేశారు. వాళ్ల మనసుల్ని వంచేశారు. గుండెలేని బండలయ్యారు. డబ్బు సంపాదించే మిషన్‌లయ్యారు. బంధం తెలీదు. అనుబంధాలు అక్కర్లేదు.

"అలసిన మన గుండెలకి ఆత్మీయత నిండిన పిల్లల ఆలంబన కావాలండీ! అనురాగం వెదజల్లే ఆదరణ కురిపించాలండీ! ఏదీ మనకా భాగ్యం?" భార్య మాటలు చెవుల్లో గింగురుమంటూంటే చప్పున కనులు తెరిచాడు విశ్వనాథం.

పక్కకి చూస్తే భార్య తన ధ్యాసలో తానుంది.

***

ఆ అంతర్మథనం ఫలితమే ఈ నిర్ణయం.

తామిద్దరం... కన్న కొడుకుల్ని తలచుకుంటూ ఇరుకు ఇరుగ్గా బ్రతకడం కంటే... అందరిలో ఒకరమై... అనాథ పిల్లల్ని అక్కున చేర్చుకొని... ఆనందంగా తమ జీవితపు ఆఖరి ఘట్టాన్ని ముగించుకోవాలని నిశ్చయించుకున్నాడు విశ్వనాథం.

ఊరుకి చివర ప్రశాంత వాతావరణంలో అనాథ ఆశ్రమాన్ని నిర్మించాడు. అనాథ పిల్లల్ని చేరదీశాడు. పనివాళ్లని నియమించాడు. తరచూ భార్యతో కలిసి వచ్చి యోగక్షేమాలు తెలుసుకొని వెళ్లేవాడు.

కానిప్పుడు...

తనదనుకున్న ఇల్లు వదిలి... తన వారనుకుంటున్న అనాథ పిల్లల చెంతే శాశ్వతంగా గడపాలని... భార్య సమ్మతంతో వ్యానులో, సామానుతో బయల్దేరాడు.

విశ్వనాథానికిప్పుడు ఇద్దరు పిల్లలు కారు. అందరు... అనాథలందరూ... సొంత పిల్లలే ! అందులో ఒక్కరైనా తమ వృద్ధాప్యానికి చేయూతగా నిలిస్తే... ఈ జన్మకదే చాలని తలపోస్తున్నాడు.

**అనాథ పిల్లల్ని మాత్రం...**

**మెటీరియలిస్టుల్లా కాకుండా, మానవత్వపు విలువలున్న మనుషులుగా పెంచే ప్రయత్నం చేస్తున్నాడు.**

**(8.9.2005)**

*